క్లుప్తంగా

బోనస్ డబ్బులు వేయండి

నర్వ: రైతులు వరి ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించగా, నేటికీ బోనస్ డబ్బులు ఖాతాలో జమకాలేదని రైతులు వాపోతున్నారు. మండలంలో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు బోనస్ డబ్బులు ఖాతాల్లో జమచేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు విక్రయించిన కొద్దిమందికి మాత్రమే బోనస్ డబ్బులు జమచేశారని, మిగిలిన వారికి సైతం జమచేయాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



కోస్గి: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మండలంలోని ముశ్రీఫా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖరయ్య అన్నారు. మంగళవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపి జిల్లాలో పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఫిజియోథెరపీని సద్విని యోగం చేసుకోవాలి



మరికల్: మండల వనరుల కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రీతిగౌడ్, మండల ఐఈఆర్సీ హరిప్రసాద్‌లు అన్నారు. మంగళవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఫిజియోథెరపీ కార్యక్రమం నిర్వహించారు. 20 మంది దివ్యాంగులకు సెరిబ్రల్ పాల్సీ, ఆర్థోపెడిక్ చలన వైకల్యం ఉన్న వారికి డాక్టర్ ఫిజియోథెరపీ చేశారు. ప్రతి వారం ఈ కార్యక్రమం ఉంటుందని, దీని సద్వినియోగం చేసుకుంటే తక్కువ అయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు.

మల్లికార్జున్ స్వామికి ప్రత్యేక పూజలు



మక్తల్: మండలంలోని దాదాన్‌పల్లి - ముస్లాయిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుల చెల్లించుకున్నారు. దాదాన్‌పల్లి గ్రామానికి చెందిన పరిగి శివారెడ్డి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కృష్ణా జలాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పరిగి శివారెడ్డి, స్థల దాత మల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ విడుదల



మాగనూర్: మండలంలోని నేరడుగోమ్‌లో మంగళవారం శ్రీసిద్ధలింగేశ్వర పశ్చిమాద్రి సంస్థాన విరక్తి మఠంలో సిద్ధలింగేశ్వర స్వామి జాతర పోస్టర్ విడుదల చేశారు. 60వ పుణ్యారాధన శాతబ్ది మహోత్సవాల సందర్భంగా అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిరంజన్ స్వాములు, లింగాయనల్లి మైసూర్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, బీజేపీ నాయకుడు కొండయ్య, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

నారాయణపేట/దామరగిద్ద: భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో బీకేఎస్ జెండాను నగర కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకటప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించడానికి భారతీయ కిసాన్‌సంఘ్ ముందుండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి, బాలప్ప, అనంతరెడ్డి, శరణమయ్యప్ప స్వామి, శ్రీనివాస్, లాలప్ప, లక్ష్మణ్ నాయక్, విశ్వనాథ్, ఆంజనేయులు, రాము, రైతులు పాల్గొన్నారు.

- దామరగిద్ద మండల కేంద్రంలో, ఉద్మల్‌గిద్ద, మద్దెల్‌బీడ్ గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. రైతులకు అండగా ఉంటూ బీకేఎస్ నిరంతర పోరాటం చేస్తుందని బీకేఎస్ జిల్లా నాయకులు బాల్‌చందర్‌రెడ్డి, మొగులప్ప అన్నారు.

డ్రెయినేజీ నిర్మాణమెప్పుడో?



డ్రెయినేజీ లేక నేలపై పారుతున్న మురుగు

- రూ.18 లక్షలు నిధులు మంజూరు
- టెండర్ దశలోనే పనులు
- అస్తవ్యస్తంగా మురుగు పారుదల
- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- 230 మీటర్ల పొడవునా ఇదే దుస్థితి



డ్రెయినేజీ లేక ఇళ్ల పక్కనే నిలిచి మురుగు

దామరగిద్ద: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది మండల కేంద్రంలో మురుగు కాల్వల నిర్మాణం. ఏడాదిన్నర క్రితం కిత్రం రోడ్డు విస్తరణ చేపట్టినా ఇరువైపుల మురుగు పారుదలకు కాల్వల నిర్మాణం చేపట్ట లేదు. వర్షాకాలంలో రోడ్డు కోతకు గురై వేసవిలో మురుగు పారుదల ఇళ్ల మధ్యనే నిలుస్తోంది. దీంతో పారిశుద్ధ్యం లోపించి దోమల వ్యాప్తి చెందడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా మండల కేంద్రంలోని సంజీవరాయ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ వరకు ప్రధాన రహదారి విస్తరణ చేపట్టారు. దీంతో ఇరుపక్కల దాదాపు 230 మీటర్ల మేర మురుగు కాల్వలు పూడిపోయాయి. కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. వాటితో పాటు నామినేషన్ పనుల్లో భాగంగా మండల కేంద్రం, ఉద్మల్‌గిద్ద, మల్‌రెడ్డిపల్లి, అన్నసాగర్ గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ మంజూరు చేసినా పనులు ప్రారంభం కాలేదు.

ఇళ్ల మధ్యనే మురుగు నిల్వ

రోడ్డుకు ఇరువైపుల మురుగు కాల్వల నిర్మాణం లేక పోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు, వర్షాకాలంలో వచ్చే వృథా నీటితో డ్రెయినేజీ వ్యవస్థ స్తంభించింది. కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్డు కోతకు గురైంది. ఇళ్ల మధ్య మురుగు నిలవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. రోడ్డుపై నుంచి దాటేందుకు ఇండ్ల ముందు స్వచ్ఛందంగా కాల్వలు నిర్మించుకుంటున్నారు.

కాల్వల నిర్మాణం చేపట్టాలి..



గతంలో ఉన్న మురుగు కాల్వలు పూడిపోయి మురుగు వర్షాకాలంలో రోడ్డుపై పారుతోంది. ఎండాకాలం ఇళ్ల ముందు మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు పెరుగుతున్నాయి. రోడ్డు వేసేటప్పుడు మోరీలు కడతామన్నారు. ఇప్పటి వరకు కట్టలేదు. స్థానిక నాయకులు చొరవ తీసుకొని మురుగు కాల్వలు నిర్మించాలి.

– శంకరమ్మ, సంజీవరాయనగర్, దామరగిద్ద

ఎస్‌డీపీ నిధులు మంజూరు



మండల కేంద్రంలో ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా 230 మీటర్ల పొడవునా డ్రెయినేజీ నిర్మాణానికి రూ.18 లక్షల ఎస్‌డీపీ నిధులు కేటాయించారు. మంజూరైన పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి అయితే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం.

– సాయిలక్ష్మి, ఎంపీడీఓ, దామరగిద్ద

ఘనంగా కట్టమీది ఎల్లమ్మ ఉత్సవాలు



పూజలందుకున్న ఎల్లమ్మ మాత మూలవిరాట్



జెల్దిబిందె ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

- జెల్దిబిందె, బోనాల ఊరేగింపు
- హాజరైన ఎమ్మెల్యే చిట్టె పర్ణికారెడ్డి

దామరగిద్ద: మండల కేంద్రంలోని కట్టమీది ఎల్లమ్మ ఉత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి జెల్దిబిందె ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. అంతకుముందు అమ్మవారి పల్లకీసేవ ఊరేగింపులో యువకులు కాషాయ జెండాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా యువకులకు కబడ్డీ పోటీలు, రెట్టపట్ల పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు పురస్కారాలు, వెండి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఆలయ కమిటీ సభ్యులు, విండో అధ్యక్షుడు ఈదప్ప, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు సంజీవరెడ్డి, లక్ష్మప్ప, కిష్టప్ప, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో ఎల్లమ్మ జాతర



లింగంపల్లి ఎల్లమ్మ గుడికి పోటెత్తిన భక్తులు..

నారాయణపేట రూరల్: గ్రామీణ ప్రజల ఆరాధ్య దైవం ఎల్లమ్మతల్లి జాతర లింగంపల్లిలో ఘనంగా నిర్వహించారు. లింగంపల్లి నాల్గవ మంగళవారం భక్తులతో జనసంద్రంగా మరింది. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. భక్తులు ఆలయ పరిసరాల్లో కొత్త కుండలో ఉడకబెట్టిన అన్నం, వంకాయ, ఉలిగడ్డ కూరలతో నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. కోడి, మేక, గొర్రెలను బలిచ్చి ప్రసాదంగా సేవించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయస్థాయిల్లో సత్తాచాటిన క్రీడాకారులు



జాతీయ స్థాయి క్రీడల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన క్రీడాకారులు

మక్తల్: జాతీయ స్థాయిల్లో సత్తాచాటి బంగారు, వెండి పతకాలు సాధించిన క్రీడాకారులకు మంగళవారం మక్తల్ పట్టణంలో జిల్లా చైర్మన్ సత్యఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం అభినందించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో మార్చిన 2వ తేదీన జాతీయ సూటింగ్ బాల్ క్రీడలో మక్తల్‌కు చెందిన 12 మంది బాలబాలికలు పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారు. తెలంగాణ జట్టు తరుపున ఆడి క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జాతీయ స్థాయిలో రాణించారు. 5 బంగారు పతకాలు, 7 వెండి పతకాలు, 1 కాంస్య పతకం సాధించారు. 5 బంగారు పతకాలు సాధించిన సబ్ జూనియర్ బాలికలు అఖిల, నవ్యశ్రీ, కవిత, బాలురు రాజేష్, రఘు, 7 వెండి పతకాలు సాధించిన సీనియర్స్ మహిళలు స్వప్న, పీఈటీ ఎన్‌శ్రీలత, గాయత్రి, బాలికలు అరుణ, శ్రావణి, మమత, పరశురాములు, కాంస్య పతకం సురేష్ జూనియర్స్ జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ క్రీడల్లో సాధించారు. షూటింగ్ బాల్ క్రీడలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరి జిత్ రాజ్ తోమర్‌జి, రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం చేతుల మీద అందుకున్నారు. రమేష్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, భూషణ్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రీన్ డే





మరికల్: మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులు చూపరులను ఆకట్టుకునేల మంగళవారం ఘనంగా గ్రీన్ డే సందర్భంగా చెట్ల ఆకారంలో ప్రదర్శన చేశారు. విద్యార్థులు ఒక్కొక్కరు చెట్టు ఆకారంలో, వేషధారణతో చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ నృత్యాలు చేశారు. వర్షాలు రావాలన్నా, మనిషికి కావాల్సిన ఆక్సిజన్ కావాలన్నా చెట్లు నాటడం, పెంచడం ఎంతో అవసరమని పాటల ద్వారా గ్రామస్తులకు, విద్యార్థులకు వివరించారు. అనంతరం వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

చంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం

నారాయణపేట ఎడ్యుకేషన్: మేరెడ్డి చంద్రారెడ్డి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ తరుపున పోరాడి చెరగని ముద్ర వేశాడని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో చంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, హాస్టల్ ఇన్‌చార్జ్ ఓంకార్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ కతలప్పకు సన్మానం

మక్తల్: పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్‌ఐ కతలప్ప పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా మంగళవారం మక్తల్‌లో రాయల్ ఫంక్షన్ హాల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, బంధువులు, స్నేహితులు, ఉద్యోగులు, నాయకులు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

మరికల్: మేతకోసం వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత పడిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మరికల్‌కు చెందిన కొండేటి కిష్టన్నకు చెందిన ఎద్దులను మేతకోసం పొలంలో వదిలాడు. ఒక ఎద్దు మేతకోసం ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి విద్యుత్ తీగలు తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. రూ.70 వేల విలువైన ఎద్దు మృతువాత పడటంతో బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయంపై ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు సంబరాలు



నారాయణపేటలో బాణాసంచా కాల్చుతున్న తపస్ నాయకులు

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపుపై బీజేపీ, తపస్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం వేరువేరుగా సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమరయ్య గెలుపు విద్యారంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. మండలిలో మూడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో రెండు తపస్ బలపరిచిన అభ్యర్థులే ప్రాతినిధ్యం వ హించడం టీచర్లకు కొండంత అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు షేర్ కృష్ణారెడ్డి అ న్నారు. వీరసవర్కర్ చౌరస్తాలో ఎమ్మెల్సీ కొమరయ్యకు మద్దతుగా సంబరాలు చేసుకున్నారు. శ్రీపాల్ రెడ్డి చట్టసభలో అడుగుపెట్టే అవకాశం రావడం సంఘం అదృష్టంగా భావిస్తున్నట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్దన్ రెడ్డి అన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

మరికల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొమరయ్య గెలుపొందడంతో బీజేపీ నాయకులు చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సంబరాలు

కొత్తపల్లి: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పింగళి శ్రీపాల్‌రెడ్డి గెలుపొందడంపై పీఆర్‌టీయూ నాయకులు మండల కేంద్రంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

- కస్టోడియన్ అధికారి సీహెచ్ రామస్వామి



ఇంటర్ పరీక్షల నియమ నిబంధనలు పాటించాలని వివరిస్తున్న సీహెచ్ దత్తాత్రేయ

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు మక్తల్‌లో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్ కస్టోడియల్ అధికారి సీహెచ్ రామస్వామి తెలిపారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడారు. ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు, 22వ తేదీ వరకు ఒకేషనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 338 విద్యార్థులకు 12 మంది ఇన్విజిలెటర్లు, మైనార్టీ గురుకుల పాఠశాలలో 432 మంది విద్యార్థులకు 22 మంది ఇన్విజిలెటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కాలర్స్ జూనియర్ కాలేజీల్లో 350 మంది విద్యార్థులకు 14 మంది ఇన్విజిలెటర్లు ఉంటారని తెలిపారు. సీహెచ్ దత్తాత్రేయ, డీఓ రమేష్, సీఎస్ శ్వేతారెడ్డి, డీఓ వెంకటేశ్వర్, సీఎస్ రాజు, డీఓ మంజునాథ్‌లకు డ్యూటీ వేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందని అన్నారు.

ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి..

కోస్గి రూరల్/ఊట్కూరు/మద్దూరు: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ఐదు నిమిషాలు ఆలస్యమైన అనుమతిస్తామని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పరశురా మ్, నర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రజ్ఞా జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రజ్ఞా, గుండుమాల్ మోడల్ స్కూల్‌కు చెందిన ప్రథమ సంవత్సరం 625 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 551 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులందరు 8.45 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సూచించారు.

- ఊట్కూరు మండలంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసి నట్లు చీఫ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 169 మంది, ద్వితీయ సంవత్సరం 158 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.
- మద్దూరులో మొదటి సంవత్సరం 235 మంది, ద్వితీయ సంవత్సరం 184 మంది పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ రాములు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బీజేపీ జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న మండల నాయకులు

మరికల్: కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్యయాదవ్ అన్నారు. మరికల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షులుగా ఎన్నికైన వేణుగోపాల్‌ను మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలను కైవసం చేసుకోవాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విజయ్‌రెడ్డి, చెన్నయ్య, నిఖిల్, రాజేష్, శ్రీరామ్, మోహన్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డిలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలి



బొందల్‌కుంట దగ్గర శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న రఘుప్రసన్నబట్

మక్తల్: రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలని అనాకులం గోకులం గోశాల చైర్మన్ రఘుప్రసన్నబట్ అన్నారు. మంగళవారం మక్తల్ మండలం బొందల్‌కుంట శివారులోని వ్యవసాయ క్షేత్రంలో గో ఆధారిత వ్యవసాయంపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి క్షేత్రంలో పండించిన వాటిపై ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం వల్ల రోగాల బారిన పడుతున్నారని, మన ఆరోగ్యం మనమే చెడగొట్టుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్దన్‌గౌడ్, రవికుమార్, శ్రీనివాస్, ముకుందారెడ్డి, వెంకటేష్, శేఖర్‌రెడ్డి, రమాదేవి, ప్రాణేష్‌కుమార్, జగదీష్, గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ శ్రీనివాస్.

నారాయణపేట: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి నకిలీ విత్తనాలపై అవగాహన పెంచాలని మేనేజింగ్ డైరెక్టర్ వసంతపు శ్రీనివాస్, నారాయణపేట మండల వ్యవసాయ అధికారి దినకర్‌లు అన్నారు. వసంత అగ్రి బయోటెక్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ బంకెట్ హాల్లో జిల్లా విత్తన డీలర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం (నాన్‌బీటీ) నకిలీ విత్తనాల పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ద్వారా తనిఖీలు చేపట్టనుందన్నారు. నాణ్యమైన విత్తనాలు అందించి రశీదు తప్పకుండా ఇవ్వాలన్నారు. డీలర్లు విత్తన లైసెన్స్‌లను అప్‌డేట్ సరి చూసుకోవాలని, స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘునాథ్‌గుప్తా, పరశురాంరెడ్డి, అశోక్‌గౌడ్, రాము, సతీష్‌రెడ్డి, జిల్లాలోని వివిధ మండలాల డీలర్లు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



కోస్గి రూరల్: యువసేతు యూత్‌ఫర్ నేషన్ ఆధ్వర్యంలో గుండుమాల్ మండలంలోని మోడల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొమ్మూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మాజీ సర్పంచ్ సుంకిరెడ్డి సురేష్‌రెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజు, జహీర్, రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి తండాలో తుల్జాభవాని పూజ



కొత్తపల్లి: కొత్తపల్లి తండాలో సామూహిక తుల్జా భవాని పూజలు గత మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. మంగళవారం చివరి రోజు తుల్జాభవాని మాతకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మేకలను బలిచ్చారు. మేళ తాళాలు, గిరిజన నృత్యాలతో అమ్మవారిని కొలిచారు. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య తుల్జాభవాని ఉత్సవాలు కోలాహలంగా సాగాయి.